# తను



ఇరవై ఏళ్ళ వాడి వయస్సు నరాల్ని పొడుస్తోంది ఆడతనం పచ్చగా కనపడినప్పుడల్లా - ఆశ వేడిగా వొణుకుతూ పాకింది వొళ్ళంతా. ఇది మొదటిసారి కాదు. ఆ వేడి, వొణుకు వొళ్లంతా పాకటానికి ఒక్కక్షణం కూడా పట్టకపోవటమే వాడికి చిత్రంగా ఉంది.

ఒంటి విషయం, కడుపులో ఆకలి సుళ్ళు తిరగటం. ఓ గంట తట్టుకుంటే లోలోపలే చచ్చిపోటం.....చలిలో వేళ్లు వొంకర్లు తిరగటం.... ఎండలో కాళ్ళు బొబ్బలెక్కటం చాలా రోజుల్నుంచి ఇవన్నీ చిత్రంగానే ఉన్నాయి.... వాటన్నిటికన్నా ఈ వేడి ఇలా పాకటమే మరీ చిత్రంగా ఉంది...

ముందు వో క్షణం మనిషనుకోలేదు వాడు.

రైలు కదిలిన కుదుపు తట్టుకునే లోపలే.... తలుపు పక్కనించి పాకుతూ వచ్చింది. అది పాకటం

కూడా కాదు. రెండు ముంజేతుల మీద బలం ఆన్చి, చొట్టకాళ్ళని ఉండలాచేసి గెంతటం.... పరికించి చూసేవరకు తను కట్టుకున్నది చీరో, లంగానో తెలియలేదు.

దేకిన మట్టితోటి, రైలుబొగ్గు మసితోటి, ఇంకా రైలుపెట్టెలోని అడ్డమైనవాటితోటి కలగలసి ఏ రంగో తెలియకుండా పోయిన చీర.

చీర కన్నా..... చొట్టకాళ్ళ కన్నా, రెండు ముంజేతుల మధ్యా వొరుసుకుంటున్న తన వొళ్ళే కనిపించింది ముందు. బిగుతుగా ఎర్రపూల రవిక.... బిగుతు భరించలేనన్నట్టు.... కిందకు జారిపోతానన్నట్టు....

మనిషని.... ఆడదని.... వయసులోనే ఉన్నదని.... గుర్తించక మునుపే..... నరాల్ని పొడిచింది వాడి వయసు.

"ఎందుకలా చూస్తున్నా?"

ఉలిక్కిపడ్డాడు. తననే అడిగింది. చొట్టకాళ్ళ మీద.... చేతులు ముందుకాన్చి కూచుని.... బురదగుంట గట్టు నుండే బోదురు కప్పలా ఉంది.

"నిన్నే..." అంది మళ్ళీ.... ముద్దగా ఉంది గొంతు.

ఏం చెప్పాలి?.... ఏమిటి చూసిందసలు ఇందాకట్నించి.... సమాధానం చెబుదామనుకుంటే నాలిక వొణికింది. ఎలాగో కష్టపడి "ఏం లేదు" అన్నాడు.

ఫక్కుమని నవ్వింది. "బాగుంది వొరస.... ఉండు - ఓ రౌండు కొట్టొస్తా" అంది.

అటూ ఇటూ చూశాడు.

ఆ తలుపు నుంచి, ఈ తలుపు వరకు ఖాళీగా ఉంది.

అటు ఆకాశం పరిగెడుతోంది.

ఇటు చెట్లు.... టెలిగ్రాఫ్ స్తంభాలు పారిపోతున్నాయి. కాళ్ళు లాగుతున్నట్టనిపించి వో తలుపు దగ్గర చతికిలపడ్డాడు. చతికిలబడ్డ తరువాత కాళ్ళనెప్పి కడుపులో లాగుతున్నట్టయింది.

కూచున్న చోటునుంచి చూస్తే రైలుపెట్టె సారంగంలా ఉంది. సారంగం అంచులమీద ఎన్నో కాళ్ళు.... మోటుగా మొద్దులా ఉన్నవి. లేతగా రేకుల్లా ఉన్నవి.... చెప్పులున్నవి.... చెప్పుల్లేనివి.... చెప్పుల్లాగే ఉన్నవి.

తను పాడుతోంది.... మొద్దు గొంతుకతో.... అడుక్కోటానికి పాటతప్పని అవసరం అన్నట్టు.

తల ఎత్తి లోపలికి చూడాలనిపించటంలేదు.... కళ్ళు మూసుకుంటే కడుపులో ఆకలికాళ్ళు కదలినట్టయింది. రైలెక్కే ముందు - మొన్న సాయంత్రం తిన్నాడు. పదిపైసల రొట్టె.... అంతే?

మొన్నెక్కిందీ రైలు కాదు... మొన్నటి నించి ఇది మూడో రైలు. మొదటిదాన్లో నుంచి దింపేశారు. రెండోదాన్లో నుంచి తనే దిగాడు, నీరసం వచ్చి... ఇది మూడోది.

ఇరవై ఏళ్ళ జీవితంలో ఎక్కడికిలా? ఎందుకిలా అనిపించింది చాలాసార్లు. అనిపించినా దానిమీదే ఆలోచన బలంగా ఏనాడూ సాగలేదు. ఎప్పుడూ ఏదో ఆశ కవచంలా ఉండేది.

మరీ చిన్నప్పుడు అందరి పిల్లల్లా అందంగా బట్ట లేసుకోవాలని.... వాళ్ళ అమ్మానాన్నల్తో నడుస్తున్నట్టే తనూ నడవాలనీ.... అది తీరని ఆశని తెలిసింది. ఆ తరువాత. ఆకలి.... ఊరికే తినేయాల

నుండేది.... కనిపించినవన్నీ. అరటికాయ బజ్జీల్లగ్గర్నించి ఆపిలు పళ్ళవరకు - ఆకలి ఆశ కాదని, అవసరం అని తెలిసే వయసొచ్చిం తరువాత ఆ ఆశ పోయింది.

ఏ సమయాని కా సమయం ఏదో ఆశ జీవితంలా ఉండేది. అది పొందటమే బతుకులా ఉండేది. ఆశల్తోపాటు వాళ్ళ తోడుండేది. అంతా తనలాంటి వాళ్ళే.... అమ్మా నాన్నే కాదు. నా అన్న వాళ్ళెవ్వరూ లేనివాళ్ళు. ఉన్నా వాళ్ళ దగ్గర్నుంచి పారిపోయొచ్చిన వాళ్ళు..... ఒంటరిగాళ్ళు.... అందరూ చేసేది ఒక్కటే. ఆకలికి తిండి సంపాదించుకోటం, నిద్రకి చోటు చూసుకోటం.... దానికోసమే హోటల్లో కప్పులు కడిగినా, బజార్లో జేబులు కొట్టినా.... అదీ ఇదీ కాకపోతే అడుక్కున్నా.... ఎన్నో రకాల బతుకు.

ఎంతో చిత్రంగా కలిసేవాళ్ళు. అంత మామూలుగానూ విడిపోయేవాళ్ళు. వాళ్ళతోడు ఆలోచించ నిచ్చేది కాదు. ఎందుకిలా అన్న విషయాన్ని వాళ్ళంతా ఎందుకో నేనూ అందుకే అనిపించేది. వాళ్ళందరూ ఏమౌతారో తనూ అంతే అనే ధీమా ఉండేది.

వాళ్ళల్లోనూ ఆనందం ఉండేది.... పేకాట్లో గెలిచిన్రోజు ఒక్క నిముషం కూడా ఊరుకోకుండా వాగేవాడు కోటి.... మంచి జేబు దొరికిన్నాడు పచ్చి బూతుల్తో సరదాని కలిపేవాడు రాముడు...... వాడు చెప్పిన విషయమే....

అదే ఇలా ఆడతనమంటే ఏమిటో తెలియడానికి కారణం.... ఈ వేడీ, ఈ వొణుకూ.... ఇదంతా....

"ఏంటి నిదరా.... లేకపోతే కలలు కంటున్నావా?"

తెరిచిన కళ్ళకెదురుగా తనే.... మాసిన కొంగుకి ముడేసుకుంటోంది. చేతిలో డబ్బులు..... ముంజేతుల మీద గెంతడం వల్ల ఓ పక్క గూడ చివరికి వచ్చింది రవిక. తన మెడకింద చెమట మెరుస్తోంది.

"ఏటా సూపు.... ఎక్కడ్నుంచి వొస్తూండా?"

"బొంబాయి" అన్నాడు.

"యాడిదాకా?"

ఔను ఎక్కడిదాకా.... ఎక్కడికో..... ఎక్కడికైతే ఏం....

"ఐతే గాలిసరుకే నన్నమాట...." నవ్వుతూ అంది.... పళ్ళ చివర్ల వరకు సాగేయి పెదాలు. తెల్లగా మెరిసిపోవటంలేదు పళ్ళు.... పచ్చగా గార కట్టుకున్నాయి.

"పోనీ, నాలాగే మొదలెట్టకూడదూ నువ్వూ" అంది నవ్వుతూ అలాగే.

"నువ్వాడదానివి" అన్నాడు.... తెలిసే అన్నాడు. అడుక్కోటంలో ఆడదానికున్నంత లాభసాటి మొగాడికి, వయసులో ఉన్నోడికి ఉండదని ఇరవైఏళ్ళ జీవితం నేర్పిన విషయం.

"ఔను నిజమే. నేనాడదాన్ని.... కుంటిదాన్ని కూడా" అంది ఘల్లుమని నవ్వుతూ.... అలా నవ్వుతూనే రెండు చేతుల్నీ హుషారుగా ఇటూ అటూ ఊపింది. తన నవ్వులో బుగ్గలన్నీ కదిలేయి... గుండెలన్నీ ఊగేయి. ఆ కదలికలో, నవ్వులో గర్వం ఉంది... అడుక్కోటానికైనా ఉపయోగపడుతున్న ఆడతనం మీద.... కుంటితనం మీద....

"ఎక్కడికని పోతావిలా?" అంది నవ్వటం మానేసి.

ఏం చెప్తాడు, తనకే తెలియనపుడు.

"ఎన్నాళ్ళిలా.... ఎవత్తినేనా సూసుకోరాదు.... ఈ తిరుగుడు తప్పించి ఒక సోటే పడుండేలా చేత్తది" అంది తనే మళ్ళీ.

ఆ మాటల్తో ఆశ కదిలింది.... కొత్త జీవితం మెరిసినట్టయింది వాడికి. అలాగే మెరిసే కళ్ళతో చూశాడు తనని.... తన దుమ్ము కొట్టుకుపోయిన తలని..... మిలమిలలాడుతున్న కళ్ళని.

ఐనా ఎక్కడికో ఎందుకు.... ఎవరున్నారని.... తనతో..... తనతోటే ఉండిపోతే..... వాడి గొంతుకలో వొణుకు చేరి తడి లేకుండా చేసింది. బైటికనాలనుకున్న మాటలు లోలోపలికి పోయి కళ్ళల్లో చేరేయి....

లోపల్నుంచి టకటక చప్పుడు చేసుకుంటూ వస్తున్నాడు..... అటు చూశాడు..... నల్లటి బూట్లూ, వాటిని కౌగిలించుకుంటూ పచ్చరంగు పేంటూ..... ఆ కాళ్ళు లెట్రిన్ తలుపు వేపెళ్ళేయి.

తిరిగి తనవైపు చూశాడు. తనూ చూస్తోంది.

"నిన్ను..... నీలాంటోళ్ళనీ..... అమాయికంగా చూసే ఆ చూపుల్నీ చూస్తే ఏదో చెయ్యాలనిస్తుంది నాకు.... ఆడదానిగా నేను చెయ్యగలిగిందంతా చేయాలనిపిస్తుంది" అంది తలొంచుకుని.

మళ్ళీ తలుపు దగ్గర్నుంచి టకటకమంటూ వచ్చింది. ఆ పచ్చరంగు పేంటు.... లోపలి కెళ్ళిపోయింది.

"చూడు, ఆ కొంగముక్కు బూట్లాడు ఎలా తిరుగుతున్నాడో..... అడి సూపుల్నూడాల, పావలా ఇచ్చాడు.... ఎందుకిచ్చాడో తెలుసు.... అంత తేలిగ్గా ఉంటది ఆళ్ళకి.... మళ్ళీ అంత తేలికని తెలిసినా, గుండెబలం లేదు. దొంగసూపులు..... దొంగనాయాలు..... అడి పేంటూ బూటూ చూసి పిచ్చెక్కి పోతాననే అడికి....."

లోపలికి చూశాడు, పచ్చరంగు పేంటు కనపడలా.....

"మళ్ళీ అడే వస్తాడ్లే, అప్పుడు చూద్దూగాని....." అంది. అటు చూస్తున్న వాడిచెయ్యి లాగి.....

లాగిన చెయ్యివేపు, వాడి కాళ్ళవేపు, పొట్టి నిక్కరువేపు గుచ్చిగుచ్చి చూసింది.....

"ఏం? మూటలు మోసేవాడివా, ఇంత బలంగా ఉన్నాయి కాళ్ళు చేతులు?" అంది.

ఔనన్నట్లు తలూపేడు, తన వొంటికేసి చూసుకుంటూ.

కళ్ళు మెరిసేటట్టు..... వాడి వొంటి గురించిన పొగర్త కళ్ళల్లో పాకేటట్టు సన్నగా నవ్వింది.... నవ్వుతూ వాడి వొళ్ళ:తా చూసింది. చెయ్యొదల్లేదు. ఆ చేత్తో అలాగే వాడి బుగ్గ మీద కొట్టి.... . "అందుకనే, అందుకనే' అంది.

కంపార్టుమెంటంతా దేకినా, ఆ మట్టిచేతి వేళ్ళ స్పర్శ ఏదో చేసినట్టనిపించింది వాడికి..... చెప్పేయాలనుకున్నాడు..... నీతోపాటే ఉంటానని..... రైలు నీతోటే దిగిపోతానని. కాని మాటలు తడబడ్డాయి లోలోపలే.

తను అలాగే చూస్తోంది.

చెప్పాలని మళ్ళీ ప్రయత్నం.

తలుపు తోశారెవరో..... స్టేషను..... ఎవరో ఎక్కుతున్నారు. ఇద్దరి మధ్య నుంచి కొన్ని కాళ్ళు కదిలి వెళ్ళిపోయాయి. లోపల ఏం కదలకుండా కడుపు నిండుగా ఉన్నట్టనిపించింది వాడికి....

కదుల్తోంది రైలు..... కదిలింది....

"ఓసి..... ఇందులో ఉన్నావటే నువ్వు....."

తలెత్తి చూశాడు. ముప్ఫయ్యేళ్ళ మనిషి..... చేతిలో బటానీల బుట్ట.....

"ఎలా ఉన్నా?" అన్నాడు తలుపు దగ్గరకేస్తూ.

"బాగానే ఉన్నా....." అంది తను.... తన గొంతు అయిష్టంగా ఉన్నట్టనిపించింది వాడికి.

"ఏందే అది..... మరీను" అన్నాడు, తన పక్కనే కూచుంటూ బటానీల బుట్టతో.

"మీ అయ్య, ముసలాడెలా ఉన్నాడు? బావున్నాడా?" అన్నాడు మళ్ళీ...... ఓ గుప్పెడు బటానీలు తన చేతిలో పోస్తూ.

"ఏదో ఉన్నాడులే.... ఆ దగ్గు తగ్గదు..... దాన్తో నన్ను సంపుకు తింటున్నాడు."

"ఏదన్నా మందు పోయించకపోయా?"

"ఏదో మందుకాడికి ఎందుకు..... రోజు ఆడు తాగే కల్లుకు డబ్బివ్వగలిగితే సాలు..... ముసలోడు కదల్లేడు..... ఆడికున్న దదొక్కటే అలవాటు - రోజుకొక్క పావల్డబ్బులు సంపాయించివ్వలేకపోతున్న..... నిన్న గంజికూడా పొయ్యలేదాడికి...."

విడవకుండా మాట్లాడుతున్నారు వాళ్ళిద్దరు.... తనవేపు చూణ్ణేనా చూట్టంలేదు. బటానీలు తింటూ వాడితో కబుర్లు చెబుతూనే ఉంది.

"తను ఇక్కడున్న సంగతే మరచిపోయిందా" అనిపించింది వాడికి..... రైలు చాలాదూరం నడిచినట్టనిపించింది..... కడుపులో ఏదో తిరుగుతున్నట్టయింది.

"ఛీ పాడాకలి' అనుకున్నాడు..... ఆకలి కాదని తెలుసది..... అదెందుకో కూడా తెలుసు..... కానీ నిజం గుర్తించటం ఇష్టంలేదు.

ఔను ఎవరు తను.... ఏమిటి సంబంధం..... ఎందుకిలా బాధ..... పోనీ.... ఇరవై ఏళ్ళలో ఎందరు కలవలే?

ఫక్కుమని నవ్వింది తను..... ఉలిక్కిపడ్డాడు. చూడకూడదనుకుంటూనే చూశాడు....

సరిగ్గా ఇందాకటిలాగే నవ్వుతోంది. బటానీలవాడిపు చూస్తూనే..... కానీ ఇందాకటిలా కళ్ళల్లో ఆ మెరుపులేదనిపించింది.

"నీకోసం నాల్రోజుల్నుంచి ప్రతి బండీ ఎతుకుతున్నా తెలుసా?" అన్నాడు, బుట్ట కుదుపుతూ బటానీలవాడు.

"ఎందుకో?....." అంది, కొంటెగా పెదవి కొరుకుతూ తను.

"ఎందుకేంటే...." అంటున్నాడు, ఈసారి బటానీలు వేళ్ళతో కలుపుతూ.

"మరి ముసలాడికి గంజి..... మందు" అంది ఓరగా చూస్తూ.

"నాకు తెలుసులేవే.... రెండుసాలా?" అన్నాడు.

నవ్వింది తను.

రైలాగింది.

వాడు దిగేడు బటానీల బుట్టతో....

ముంజేతుల మీదకు వొంగింది తను..... సొట్టకాళ్ళు ఉండలా పైకి లేచాయి.

ఓ గెంతు..... కంపార్టుమెంటు తలుపు.... మరో గెంతు..... ప్లాట్‌ఫారం....

దిగిపోయింది తను....

తలుపుదాకా వచ్చాడు.

దిగేటప్పుడే కొద్దిగా తల తిప్పి చూసింది వాణ్ణి....

అలాగే కదలకుండా నిలబడ్డాడు, తలుపు దగ్గర....

రైలు కదులుతోంది.....

ఒక్కసారి....

ఒక్కసారి చాలు.... వెనక్కి తిరిగి, 'దిగు'' అని సైగచేస్తే చాలు....

ప్లాట్‌ఫారం మీదికి దూకుదామనిపించింది వాడికి.... ఎంతసేపైనా, ఎన్ని రోజులైనా తను తిరిగొచ్చే వరకు ఎదురుచూద్దుననిపించింది వాడికి....

తను వెనక్కి చూళ్ళేదు....గెంతుతూ గెంతుతూ వెళ్ళిపోతోంది. పక్కతలుపు దగ్గర పచ్చపేంటు కదులుతోంది.... రైలు ప్లాట్‌ఫారం దాటేవరకు తలుపు దగ్గరే ఆశగా నిలబడ్డాడు వాడు.


- *ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, 1970*
- *కల్కి, 31-1-1971 (తమిళం)*
- *కర్మవీర, 11-7-1971 (కన్నడం)*
- News Time, 5-8-1984 (English)